
# వానపాట

-బెజ్జారపు రవీందర్



**సన్నటి తుంపర పడుతోంది. ఎన్నో ఏళ్ల తరువాత కలిసిన ఆప్తమిత్రుడిలా పలకరిస్తోంది వాన. పొగమంచు మాటున రామగిరి గుట్టలు...**

ఇంత అద్భుతమైన వాతావరణాన్ని ఆఫీసు పనికి బలి చేయాలనిపించలేదు. ఎక్కడికెళ్ళాలి?... కుమార్ గుర్తొచ్చాడు. వాడిప్పుడేం చేస్తుంటాడు? స్కూటర్ని వెనక్కి తిప్పాను. వెళ్లేసరికి వరండాలో విశ్రాంతిగా కూర్చున్న కుమార్... గ్లాసులో విస్కీ! వర్షాన్ని చూస్తూ సిప్ చేస్తున్నాడు. నన్ను చూడగానే సంతోషంతో 'వారెవ్వా!' అంటూ అరిచాడు.

'ఇప్పుడే నీ గురించి ఆలోచిస్తున్నాను. అంటే కేవలం నీ గురించే కాదు. నా చిన్నప్పటి వాన... ఈ వానా ఒక్కటేనానా అనీ... నా తొలి ప్రణయాల గురించి... అడ్డదిడ్డంగా సాగిన నా జీవన ప్రయాణం గురించి... నువ్వంటావే, ఆషామాషీ జీవితం అని. ఆ ఆషామాషీకి వ్యుత్పత్తి ఏంటా అనీ... డిష్ కనెక్షన్ డిస్ కనెక్ట్ అయిన టీవీలో కనిపించే డాట్స్‌లా వుంది కదా వాన... ఓ హైకూ కూడా అల్లాను. తీగవూడిన టీవీలో అడ్డంగా కురుస్తోంది వాన... ఇది తోచగానే నువ్వు గుర్తొచ్చావు' అన్నాడు కుమార్. గ్లాసులో మిగిలిన విస్కీని గొంతులో పోసుకుంటూ.

విస్కీ గొంతులో పడగానే జడితిచ్చిన మేకలా తల విదిలించాడు కుమార్. నవ్వాను నేను.

నేను ఇంకా స్థిమిత పడకముందే మళ్ళీ మాటలు మొదలుపెట్టాడు.

'కాని ఒక్కటే బెంగ... కాస్త ఎండ పొడ ఉంటే రెయిన్‌బో వచ్చేది కదా. ఒకసారి నీవన్నావే. కాకి లగ్గానికి వేసిన పెళ్లి పందిరే ఇంద్రధనుస్సు అని. కాని మొన్న అరుణోదయ విమల పాడిన పాట విన్నాను. ఎన్‌కౌంటరైన ఏడుగురు నక్సలైట్ల ఎలిజీ అది... రంగురంగుల ఏడు రంగుల సింగిడి నింగి నేల పరచుకుందో మాయన్న అంటూ ఆమె పాడుతుంటే... చనిపోయిన వాళ్లలో ఏమన్న లోపాలు ఉంటే ఉండనీగాక, అంత అద్భుతంగా కీర్తింపబడడం వాళ్ల అదృష్టం! ఇప్పుడు చెప్పు, నీ మెటాఫర్ గొప్పదా? ఆమెదా?' అంటూ ప్రశ్నించాడు.

నేను నవ్వుతూ-

'కాస్త టీ పెట్టి ఇస్తావా? వర్షాన్ని చూస్తూ, టీ తాగుతూ, కవిత్వం గురించో కథల గురించో మాట్లాడుకోవడం గొప్ప అనుభూతి' అన్నాను.

'అదే నేను అడుగుతున్నది, మాట మార్చకు. వర్షాన్ని చూస్తూ విస్కీ తాగడం కంటే టీ తాగడం గొప్ప అనుభూతా? నువ్వు సోషల్ వర్క్ అంటూ ఊళ్ల మీద పడతావే, అది గొప్ప జీవితమా... నాకు నచ్చినట్లు ఏ పని చేయకుండా మా నాన్న ఆస్తిని కరగదీస్తూ బతుకుతానే, అది గొప్ప జీవితమా? ఎవరైనా వారికి నచ్చినట్లు గడపడమే కదా కావలసింది. ఒక ఉద్యమకారుడు... ఒక వర్క్ హాలిక్... ఒక సాహితీవేత్త... ఒక సంగీతకారుడు... ఒక రికామీ లైఫ్ స్టైల్‌గాడు... వీళ్లలో ఎవరు సక్సెస్‌ఫుల్ లైఫ్ లీడ్ చేస్తున్నట్లు? అందరూ కదా. మరలాంటప్పుడు నా గురించే నెగెటివ్‌గా ఎందుకు మాట్లాడతారు? జీవిత పరమార్థం ఏమిటో విశదపరచు సిద్ధార్థుడా!' అంటూ ఆగాడు కుమార్.

ఇంతలో అక్కడికి మరో రెండు బండ్లు వచ్చాయి. వస్తూనే వినయ్, అశోక్‌లు రెయిన్ కోట్లు తీసేసి కిటికీకి తగిలించారు. లోపలున్న కుర్చీలను తీసుకువచ్చారు. అందరం కూర్చున్నాం. కొద్దిసేపటిదాకా ఎవరం మాట్లాడలేదు.

'ఒక్కసారి కుండపోత వర్షం కురిసి వెలిస్తే బాగుండు. ఈ తుంపరలో ఎటూ తోచదు' అన్నాడు అశోక్ విసుగ్గా మొహం పెట్టి.

'అవును నా. మేమొచ్చేసరికి మీరేదో సీరియస్ డిస్కషన్‌లో ఉన్నట్టున్నారు?' అంటూ అడిగాడు వినయ్.

'సీరియస్సే. కాని డిస్కషన్ లేదు. వాడు విస్కీ తాగుతున్నాడు కదా, నంచుకోడానికి ఏదీ లేనట్టుంది. నేను దొరికాను' అన్నాను.

'కానిబాల్' అంటూ నవ్వారిద్దరూ.

'కానిబాల్ కానిదెవ్వరోయ్. ఒక ఫ్యాక్టరీ ఓనర్... ఓ కరప్టెడ్ బ్యూరోక్రాట్ ఆల్సో కానిబాల్స్. చివరికి ఇవి మ్యాన్ ఈటర్ ప్రభుత్వాలు కాదూ?!...' అన్నాడు వినయ్.

అందరూ స్థిమితపడ్డాక కుమార్ తన డైలాగుల్ని మళ్ళీ మొదటి నుండి చెప్పుకొచ్చాడు. వాడితో వాదన పెట్టుకోవడం ఇవ్వాళ ఇష్టం లేదు. చివరకు వినయే మళ్ళీ నోరు విప్పాడు.

'ప్రపంచంలో ప్రతి కాంపొనెంట్‌కి కొన్ని భౌతిక, రసాయనిక లక్షణాలుంటాయి. మనిషి అనే కాంపోజిట్ మ్యాటర్‌కీ కొన్ని లక్షణాలున్నాయి. చెదును చూస్తే రక్తం సలసలా మరగాలి. నిస్సహాయతను, వేదనల్ని చూస్తే హృదయం ద్రవించి పోవాలి. ఇట్లాంటి బాయిలింగ్, మెల్టింగ్ పాయింట్లున్న పదార్థమే మనిషి! ఈ ప్రమాణాల ఆధారంగా జీవన విధానం ఉండాలి' అన్నాడు వినయ్.

ఆలోచనలో పడిపోయాడు కుమార్.

వినయ్ నన్నెప్పుడూ ఆశ్చర్యపరుస్తూనే ఉంటాడు. సమస్యను దొరకబుచ్చుకునే తీరు, దానిలోని క్లిష్టతను ఎక్కడికక్కడ విడగొట్టి విశ్లేషించే తీరు అమోఘం! మాట్లాడేప్పుడు అతని కంఠస్వరంలోని హెచ్చుతగ్గులు... గాంభీర్యం... ఆవేశం... అప్పుడప్పుడు సన్నగా వచ్చే నవ్వు... అన్నీ ఎదుటి వాడిని అతని వశంలోకి తెస్తాయి.

నలుగురం కాస్సేపు వర్షాన్ని చూస్తూ నిశ్శబ్దంగా ఉండిపోయాం. వర్షపు చినుకులు గొప్ప సంగీత కచేరీని నిర్వహిస్తున్నాయి. వింటూ ఎవరి ఆలోచనల్లో వాళ్లం ఉండిపోయాం.

• • •

అంతలో ఇంటి ముందర ఆటో ఆగిన చప్పుడు. ఆటోలోంచి దిగిన వ్యక్తి, సరళ. వినయ్ ఆఫీస్ కొలీగ్! మా అందరితోను స్నేహంగా, చనువుగా ఉంటుంది.

'మొత్తానికి ఐదుగురం మళ్ళీ చాలా రోజుల తరువాత కలిశాం' అన్నాడు వినయ్.

'పంచ పాండవులం' అంటూ నవ్వాడు అశోక్.

'పంచ పాండవుల్లో స్త్రీ లెవరూ లేరోయ్' అంటూ సవరించాన్నేను.

'ఆమెను స్త్రీ అన్నదెవరు?' మోటుగా జోక్ చేశాడు కుమార్.

'విస్కీ తాగే మగాళ్లతో స్నేహం చేయడం నాదే తప్పు' అని విసుక్కుంటూ ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

నీలిరంగు చీర, ఆమె బంగారు మేని ఛాయను మరింత మెరిసేటట్లు చేస్తోంది. పెదవులపై చెరగని చిరునవ్వు ఆమెకున్న గొప్ప సంపద!

సరళ రాక అక్కడి వాతావరణంలో ఒక కొత్త ఉత్సాహాన్ని తెచ్చింది. ఎంత స్నేహితురాలు గానీ... స్త్రీ సహజమైన ఆకర్షణ మా అందరినీ కమ్మేసింది.

'ఎలా సాగుతున్నాయి, నీ జీవకారుణ్య కార్యక్రమాలు?' ప్రశ్నించాన్నేను.

సమాధానంగా చిరునవ్వు నవ్వింది.

కాని అశోక్ ఆమెను వదలదలచుకోలేదు.

'జీవకారుణ్యం!... ఓ హంబక్!... నీ తోటి మనుషులు నీకక్కనపడరు. ఆ కుక్కలు, కోతులు తప్ప నిత్యం శిలువ మోస్తున్న జీవితాలు ఆనవు మీకు. చైతన్యంతో తొణికిసలాడే మనుషులు ఉన్నపళంగా అదృశ్యమవుతున్నారు. ఎక్కడో శవాలుగా తేలుతున్నారు. అంధ విశ్వాసాలతో, రోగాలతో, ప్రభుత్వాల వెధవ పాలసీలతో మనుష్యులు కుక్కచావులు చస్తున్నారు. వాళ్లెవరూ నువ్వు చూసే జంతువులతో కనీసం సమానం కాదు కదా...' అన్నాడు అశోక్ ఆవేశంగా.

అశోక్ ఆవేశాన్ని, మాటల్ని చూసి బిత్తరపోయాను.

ఏంటీ, ఇవ్వాళ వర్షాన్ని చూస్తూ సరదాగా గడుపుదామనుకుంటే ఎక్కడి వాళ్లక్కడ మరొకళ్ల మీద విరుచుకు పడుతున్నారు.

అశోక్ మాటలకు చలించలేదామె. స్థిరంగా అతని వైపు చూస్తూ చిరునవ్వుతో-

'అట్లాంటి వాళ్ల యోగ క్షేమాలు చూడడానికి నువ్వున్నావుగా! అందుకే బేఫికర్‌గా నా ధ్యాసను వేరే జీవాల మీద కేంద్రీకరించా' అంది సరళ.

ఎవరం ఏమీ మాట్లాడకపోయేసరికి తిరిగి అంది.

'నువ్వు చెప్పిన విషయాల గురించి నువ్ మాత్రం చేస్తున్నది ఏమిటి? నథింగ్! ఆఫీసు కెళతావు. వస్తావు. అటు తిరిగి ఇటు తిరిగి కాస్సేపు రాజకీయాలు చర్చించి ఇంటికి చేరుకుంటావు. ఇంట్లో పెళ్ళాం, పిల్లలు... తిరిగి మళ్లీ పొద్దున్నే రొటీన్... ఇంతేగా! నువ్వేమీ చేయవు. ఎవరన్నా ఏదన్నా చేస్తే వంకలు పెడతావ్. నువ్వు పొరహక్కుల ఉద్యమంలోనో, సోషల్ వర్క్‌లోనో కార్యకర్తవై ఉంటే నేనేమీ మాట్లాడేదాన్ని కాదు. తలవంచుకుని వినేదాన్ని' అంది కటువుగా.

అశోక్ ఆమె వైపు సూటిగా చూడసాగాడు. సరళ కూడా అతని కళ్లలోంచి చూపులు దించలేదు.

'శాంతి... శ్శాంతి...' అంటూ వారి మధ్య కర్చీఫ్ ఊపాడు కుమార్.

మళ్ళీ నిశ్శబ్దం... వర్షపు సంగీతం అందరినీ తిరిగి మామూలు స్థితికి తీసుకువచ్చింది.

• • •

కొద్దిసేపట్లోనే వర్షం ఊపందుకుంది. పతాక స్థాయిని చేరుకున్న జానపద గాయకుడి గొంతులా ఉంది వాన పాట. ఆకాశం నల్లటి మబ్బులతో కమ్మి ఉంది. నాలుగ్గంటలకే చీకటయింది. లైట్లు వేసుకోక తప్పలేదు.

గేటు చప్పుడయింది. ఈ వర్షంలో వచ్చేదెవరబ్బా అని అటు తల తిప్పాం. ఒక స్త్రీ, సుమారు ఇరవై ఐదేళ్ళుంటాయేమో, పరిగెత్తుకుంటూ మా వైపు వచ్చింది. ఆయాసంతో ఎగపోస్తూ ఉంది.

ఆమెను పోల్చుకోలేక పోయాను. మిగతా వాళ్ల తాలూకూ కూడా అయి ఉండే అవకాశం లేదు. నల్లటి శరీరచ్ఛాయ, మెరిసే కళ్లు, మనిషి నిటారుగా, హుందాగా ఉంది. కాని ఆమె కళ్ళే నన్ను ఆశ్చర్యచకితుల్ని చేశాయి. దేనికీ లొంగని ఆత్మవిశ్వాసం... పరిసరాల్ని అప్రమత్తంగా పరికించే పులి చురుకుదనం ఆ కళ్లల్లో కనపడింది. వాటిలో కొద్దిగా భయం కూడా వున్నట్లనిపించింది.

బహుశా వర్షంలో షెల్టర్ కోసం ఇటువైపు వచ్చినట్లుంది. ఒకేసారి ఇంత మందిని చూసి మొహమాట పడుతున్నట్లుంది.

ఆమెను మా వైపు ఆహ్వానించాం. కుమార్ కుర్చీ వేశాడు. దాన్ని కాస్త గోడ దగ్గరగా చీకట్లోకి జరుపుకుని కూర్చుంది. చుట్టూ కలియజూసిందామె. సరళను చూసి పలకరింపుగా నవ్వింది.

'ఆరో మెంబర్... కర్త పాత్రధారి' గొణిగాడు అశోక్ ఆమెనే చూస్తూ.

'సారీ!... వర్షం వెలియగానే వెళ్ళిపోతాను' అంటూ సర్దుకుని కూర్చుంది. వరండాలోకి వచ్చాక కూడా రెయిన్ కోటు విప్పలేదామె. బహుశా చలి పెడుతుందేమో.

'వర్షం పడుతున్నప్పుడు నిండుగా పారే గోదావరిని చూడాలి. ఆ ఒడ్డూ, ఈ ఒడ్డూ ఒరుసుకుంటూ... మహావేగంతో... పారే గోదారి... అదీ వర్షంలో... ఎంత అద్భుతంగా ఉంటుందో!' అన్నాడు వినయ్ కళ్లు మూసుకునే గొప్ప పారవశ్యంతో.

కుమార్, వినయ్, నేను ముగ్గురం పాతదాంరాజుపల్లి, వాల్గొండ గోదారుల్ని... నిండుగా పారే గోదారుల్ని చూసి... ఆశ్చర్యంతో సంతోషంతో నోట మాట రాక... ఆ గొప్ప సౌందర్యాన్ని అలాగే చూస్తూ వర్షంలో గంటల కొద్దీ సమయం గడిపిన రోజులు గుర్తొచ్చాయి.

అకస్మాత్తుగా ఆ కొత్తమ్మాయి నోరు విప్పింది.

'గ్రేట్... చాలా బాగా చెప్పారు. నిండు గోదారి వేగం మహాద్భుతం. సమస్తాన్ని తనతో లాక్కెళుతుంది. అలా అనేకంటే అన్నీ ఆ ఆకర్షణలో పడి తమంతట తామే కొట్టుకు పోతాయేమో అన్నట్లు ఉంటుంది' అంది.

అకస్మాత్తుగా ఆమె మాటల్లో మరేదో స్ఫురించింది. ఆమె నిజంగా గోదారి గురించే మాట్లాడుతోందా? మరేదైనా...?

ఏదైతేనేం ఆమె మాటలు నచ్చాయి. వర్షాకాలపు నిండు గోదారిని చూసినప్పుడు మోహావేశం నిండిన స్త్రీ, పోటెత్తే జనతరంగం, పరాకాష్ట చేరుకున్న ఒక ఉద్యమం గుర్తొస్తాయి.

కుమార్ లోపలికి వెళ్ళాడు. టేప్ ఆన్ చేశాడు. ముఖేష్ గొంతు మమ్మల్ని కమ్ముకుంటోంది. ఒక గొప్ప ట్రాన్స్‌లోకి వెళ్లిపోయాం. అందరి హృదయాలు తీయనైన వేదనతో బరువెక్కాయి. కేసెట్ అయిపోయింది. పాట ఆగిపోయింది.

'మీకు ముఖేష్ ఇష్టమా?' అంటూ అడిగాడు వినయ్. కొత్త వాళ్లతో మాటలు కలపడంలో అతడు సిద్ధహస్తుడు.

ఆ కొత్తమ్మాయి నవ్వింది.

'ముఖేష్ పాటలు మెత్తటి పూల బాణాల్లా ఉంటాయి. వీటికన్నా నాకు గాయపరిచే పాటలే ఇష్టం. ఊపిరాడనీయని పాటలు, వెంటాడే పాటలు, బతుకునిచ్చే పాటలంటే ఇష్టం' అందామె.

'ఏదీ అట్లాంటి ఒక పాట పాడండి' బతిమాలుతున్నట్లుగా అడిగాడు వినయ్‌ణ.

వాళ్ల సంభాషణని మేం ఆసక్తిగా వింటున్నాం.

ఆమె గొంతు సర్దుకుంది.

పాట అందుకుంది.

పాడుతున్నప్పుడు మాట్లాడినప్పటి గొంతులా లేదు. కొంచెం కొత్తగా ఉంది.

'నిండూ అమాసనాడు ఓ రాచగుమ్మడీ  
ఆడపిల్ల పుట్టెనని ఓ రాచగుమ్మడీ  
అత్త తొంగి చూడలేదు ఓ రాచగుమ్మడీ  
మొగడూ ముద్దాడరాలే ఓ రాచగుమ్మడీ

... ... ... ... ...

... ... ... ... ...

ఆ... సమ్మక్కనూ జేస్తే ఓ రాచగుమ్మడీ  
సారక్కనూ జేస్తా ఓ రాచగుమ్మడీ'

అది పాటా...? వర్షాకాలపు నిండు గోదారి మా మధ్య ప్రవహిస్తున్నట్లనిపించింది. పాట అయిపోయాక కూడా ఆ హోరు మా చెవులను వీడలేదు. ఆ ప్రవాహపు వేగం మా కళ్ల ముందు నుండి అదృశ్యం కాలేదు.

అందరం చప్పట్లు కొట్టాం, అభినందిస్తున్నట్లుగా. ఆమె మొహంలోని భావాల్ని పసిగట్టడానికి ప్రయత్నించాను.

గోడ నీడ నా ప్రయత్నానికి అడ్డు తగిలింది.

వర్షం వెలిసింది. రోడ్డుపై లైట్లు వెలిగాయి. రోడ్డు మెల్లగా సందడిని సంతరించుకుంటోంది.

ఇంతలో రోడ్డుపై ఏదో గొడవ... వరండా లోంచి రోడ్డు మీదున్న దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది.

పోలీసులు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. దొరికిన మనిషిని దొరికినట్లు పట్టుకుని ప్రశ్నిస్తూ, అరుస్తూ... షర్టుల్ని జరిపి, వీలు కాకపోతే బటన్స్ తెరిపి, కాలర్‌బోన్స్ దగ్గర ఏదో ఆనవాళ్ల కోసం వెతుకుతున్నారు. ఆడవాళ్లను కూడా వదలిపెట్టడంలేదు. ఏం జరుగుతుందో మాకింకా పూర్తిగా అర్థం కాకముందే ఒక పోలీస్ అధికారి గేటు తీసుకుని మా వైపు రావడం కనిపించింది.

అతను ఎస్.ఐ. మహేష్. మా అందరికీ పరిచయమే. కుమార్ మందుమేట్! గేటు దగ్గర నుండే చేయి ఊపాడు.

కుమార్ అతని దగ్గరగా వెళ్ళాడు.

'ఏం జరుగుతోందక్కడ' అంటూ ప్రశ్నించాడు కుమార్.

'చెకింగ్... మాకో ఇన్ఫర్మేషన్ వచ్చింది. అందుకే' అంటూ సమాధానమిచ్చాడు మహేష్.

మా వైపు చూస్తూ కన్ను గీటుతూ-

'సిట్టింగా?' అంటూ అడిగాడు మహేష్ నవ్వుతూ.

'రా. నువ్వూ జాయినవుదుగానీ' ఆహ్వానించాడు కుమార్.

కుమార్ భుజం మీద చరిచి వెళ్లిపోయాడు. కొద్దిసేపయ్యాక గొడవ సద్దుమణిగింది. పోలీసులు వెళ్లిపోయారు. మళ్ళీ ట్రాఫిక్ యధావిధిగా.

ఒక గంట గడిచింది. ఆమె లేచి నిలబడింది. మా అందరి వైపు చూస్తూ చేతులు జోడించి నమస్కరించి

'థాంక్స్. వెళ్ళొస్తాను' అంది.

వెళ్ళబోతూ ఎందుకో నా వైపు చూసి నవ్వింది. రెయిన్ కోటు తీసి మడిచింది. అలా చేస్తున్నప్పుడు ఆమె జాకెట్ కాస్త పక్కకి తొలగింది.

ఆమె భుజంపైనున్న కమిలినట్లున్న నల్లటి చార నా దృష్టి నుండి తప్పించుకోలేక పోయింది. బహుశా బ్రా వల్లనేమో ఆ చార అనుకున్నాను. కాని అకస్మాత్తుగా తట్టింది నాకు - అది బ్రా చేసిన చార కాదని... కిట్‌బ్యాగ్ వేసుకుని, మోసిమోసి అయిన నల్లటి చార అని!! పోలీసులు వెతుకుతోంది అట్లాంటి గుర్తుగల వాళ్ల కోసమే అనీ!

నా ఆలోచనల్ని గమనించినట్లు నా వైపు చూస్తూ, నవ్వుతూ నడుస్తోంది.

నోరు తెరుచుకుని చూస్తుండిపోయాను.

ఆమె హుందాగా, అదే నిటారైన శరీరంతో నడవసాగింది. ఆమె వెనుకే వెళ్లాను. గేటు దాటింది. నేను అక్కడే ఆగాను.

మా మిత్రబృందమూ గేటు దగ్గరికి వచ్చింది.

ఆమె రోడ్డు దాటుతోంది.

ఎందుకో అనుమానం వచ్చి ఆగింది. ముందు రోడ్డుపై ఒక పసిపిల్లాడు!... ఎదురుగా దూసుకు వస్తున్న లారీ!

ఆమె ఒక్క క్షణం వృధా చేయలేదు. రోడ్డుకు అడ్డంగా పరుగెత్తింది. పిల్లవాడిని చేతుల్లోకి తీసుకొని నెట్టింది. లారీ ఆగకుండా వెళ్లింది.

మా నోళ్ల వెంట 'అయ్యో' అనే అరుపులు. దిగ్భ్రాంతి. ఎలా పరిగెత్తాయో, ఎప్పుడు పరిగెత్తామో తెలియలేదు. పిల్లాడు క్షేమం. మోచేతులు ఒరుసుకు పోయి, అస్తవ్యస్త దుస్తులతో ఆమె! లేచి నిలబడింది.

దుస్తులు సర్దుకుంటూనే వెళ్లింది. వెళ్తూ వెళ్తూ ఆమె చూసిన చూపు... కొత్తకొత్త అర్థాలు స్ఫురింపజేస్తూనే ఉంది.

★